సాక్షి
మహబూబాబాద్
మంగళవారం | 6 | ఫిబ్రవరి | 2024



భక్తులకు మెరుగైన సౌకర్యాలు
మేడారం జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క తెలిపారు.
- 8లో▸



భవ్య కుటుంబీకుల రాస్తారోకో
భవ్య మృతికి కారణమైన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బుధరావుపేట జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు.
- 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.6^0 / 18.6^0
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు



తొర్రూరు: మేడారం జాతరకు ఆర్టీసీ తొర్రూరు డిపో నుంచి ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డీఎం బి.విశ్వనాథ్ తెలిపారు. మేడారం జాతరకు బస్సుల ఏర్పాట్లపై సోమవారం డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో సమావేశం ఏర్పాటు చేశారు. డీఎం మాట్లాడుతూ.. మేడారం జాతరకు తొర్రూరు, వర్ధన్నపేట పాయింట్ల నుంచి 186 బస్సులు నడపనున్నట్లు తెలిపారు. మేడారం జాతరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఉంటుందని తెలిపారు. తొర్రూరు నుంచి పెద్దలకు రూ.350టికెట్, చిన్నారులకు రూ.200, వర్ధన్నపేట నుంచి పెద్దలకు రూ.300, చిన్నారులకు రూ.160 ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీఐ రజిత, సూపరింటెండెంట్ తిరుమల్‌రావు, ఎంఎఫ్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

నెహ్రూసెంటర్: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ వైద్యులకు సూచించారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, ప్రభుత్వ మెడికల్ కళాశాలను సోమవారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం చేయవద్దని, విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రి సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైద్యవిద్య విద్యార్థులతో మాట్లాడారు. కష్టపడి వైద్య వృత్తిలో రాణించి మంచి స్థానంలో నిలవాలన్నారు. అనంతరం వైద్యాధికారులు, వైద్యులు, ప్రొఫెసర్లతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, డాక్టర్ వెంకట్రాములు, ప్రభుత్వ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: దేశ వ్యాప్త ఈనెల 16న జరగనున్న కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పర్వత కోటేశ్, హలావత్ లింగన్న పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సమ్మె పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమ్మెలో కార్మికులు, కర్షకులు, ప్రజలు పాల్గొని ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను విక్రయిస్తూ దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్న కేంద్ర ప్రభుత్వ తీరును ఖండించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి. జబ్బార్, నాయకులు తెల్లబోయిన లక్ష్మయ్య, లచ్చిరాం, చంద్రమౌళి, అశోక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు చేసిన తర్వాతే బిల్లులు చేస్తాం



సాక్షి ఎఫెక్ట్..

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీలో బీటీ రోడ్డును పూర్తిగా తనిఖీ చేసిన తర్వాతే బిల్లులు చేస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి అన్నారు. మున్సిపాలిటీలో క్వాలిటీ లేకుండా రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. ఈ మేరకు సాక్షి దినపత్రికలో 'కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం' శీర్షికన ప్రచురితమైన కథనానికి సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి స్పందించారు. వెంటనే సంబంధిత అధికారులు బీటీ రోడ్డును తనిఖీ చేయాలని ఆదేశించారు. కాగా ఏఈ సురేష్, సిబ్బంది ఆ రోడ్డును సందర్శించి తనిఖీలు(క్యూసీ) చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే బిల్లులు నిలిపివేస్తామన్నారు. అడ్డగోలుగా బిల్లులు ఇవ్వమని, ప్రతీ రోడ్డు నిర్మాణం చేసేటప్పుడు అధికారులు పర్యవేక్షించి నిబంధనలకు అనుగుణంగా పనులు చేయించాలన్నారు. తనిఖీల నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

మానుకోట సీటు.. హాట్

- ఎంపీ టికెట్ కోసం ఆశావహుల ప్రయత్నాలు
- కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తే గెలుపు ఖాయమని నమ్మకం
- ఇతర జిల్లాల నాయకులు సైతం నజర్
- ధన, జనబలం ఉన్న నాయకుడికే టికెట్ ఇచ్చే అవకాశం



సాక్షి, మహబూబాబాద్: కాంగ్రెస్ పార్టీలో మానుకోట ఎంపీ టికెట్ కేటాయింపు హాట్‌టాపిక్‌గా మారింది. టికెట్ వస్తే చాలు గెలుపు ఖాయమనే నమ్మకంతో ఆశావహులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. గాడ్‌ఫాదర్స్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నాయకులు సైతం టికెట్ కోసం పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కాగా పార్టీ మాత్రం జన, ధనబలం ఉన్న నాయకుడిని ఎంపిక చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

డబ్బుల ఖర్చుపై అంచనా..
ఎన్నికలు ఏవైనా పైసలదే పైచేయి. వార్డు సభ్యుడి నుంచి పార్లమెంట్ సభ్యుల వరకు ఎన్నికల్లో పోటీ చేయాలంటే ముందుగా డబ్బులపైనే చర్చ వస్తుంది. ప్రస్తుతం డబ్బులు ఖర్చు చేసేవారికే మానుకోట ఎంపీ టికెట్ కేటాయించాలని కాంగ్రెస్ అధిష్టానం యోచిస్తున్నట్లు తెలిసింది. ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్‌తోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 13లక్షల పైచిలుకు ఓటర్లు ఉన్నారు. కాగా ఎన్నికల్లో పది లక్షల మంది ఓటర్ల వరకు డబ్బులు పంచాలి. ఇలా ఓటరుకు రూ.500ఇస్తే ఇవే రూ.50కోట్ల మేరకు అవసరమవుతాయి. తక్కువలో తక్కువగా కనీసం ఓటుకు రూ.300 ఇచ్చినా.. రూ 30కోట్లు అవసరం. ఇక వాహనాలు, సభలు, సమావేశాలు, ప్రచారం ఇలా అన్ని కలుపుకొని కనీసం రూ.50కోట్ల నుంచి రూ.100కోట్ల మేరకు అవసరం అని రాజకీయ నాయకులు లెక్కలు వేస్తున్నారు.

మేం డబ్బులు పెట్టలేం..
ఎన్నికల్లో తాము గెలవడమే కాదు.. పార్టీ ప్రతిష్ట పెంచాలంటే ఎంపీ అభ్యర్థిని కూడా గెలిపించుకోవాల్సిన అవసరం ఉంటుందని టీపీసీసీ అధినాయకత్వం ఇటీవల పార్టీ ఎమ్మెల్యేలతో చెప్పారు. అయితే ప్రచారం చేస్తాం కానీ, డబ్బులు ఖర్చు పెట్టే విషయంలో తమతో కాదని పలువురు ఎమ్మెల్యేలు పార్టీ అధిష్టానానికి తేల్చి చెప్పినట్లు తెలిసింది. పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు స్థానాల్లో ఆరు స్థానాలు ఎస్టీ రిజర్వుడు స్థానాలే. ఇందులో భద్రాచలం మినహా మిగిలిన ఆరు స్థానాలు కాంగ్రెస్ గెలిచింది. వీరిలో ఒక్కరిద్దరు మినహా మిగిలిన ఎమ్మెల్యేలు వారి ఎన్నికల్లో ఖర్చు పెట్టేందుకే నానా అవస్థలు పడాల్సి వచ్చింది. ఎన్నికల సమయంలో అప్పు, బదులుగా తెచ్చిన డబ్బులను ప్రస్తుతం సర్దే పనిలో ఉన్న ఎమ్మెల్యేలు ఎంపీ ఎన్నికల కోసం డబ్బులు ఖర్చు పెట్టేందుకు సాహసం చేసే పరిస్థితి కనిపించడం లేదు. ఒక వేళ భూములు, ఆస్తులు ఉన్నా.. ఎవరి ఎన్నిక కోసమో డబ్బులు పెట్టలేమనే ఆలోచనలో లేమని చెబుతున్నారు.

టికెట్ కోసం 47మంది దరఖాస్తు..
మానుకోట ఎంపీ టికెట్ కోసం కాంగ్రెస్ పార్టీ నుంచి 47మంది దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిసింది. వీరిలో ఎంత మందికి జన బలం.. ఎంత మందికి ధన బలం ఉందనేది పార్టీ నాయకులు ఆరా తీస్తున్నట్లు ప్రచారం. ప్రధానంగా టికెట్ ఆశిస్తున్న వారిలో కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్, ఎల్‌హెచ్ పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బెల్లయ్యనాయక్, నెహ్రూనాయక్, భూపాల్‌నాయక్, రాధ గతంలో ఎమ్మెల్యే టికెట్ ఆశించి చివరి నిమిషంలో వెనక్కి తగ్గారు. ఆ సమయంలో వీరిలో కొందరికి ఎంపీగా అవకాశం ఇస్తామని పార్టీ హామీ కూడా ఇచ్చినట్లు వారివారి అనుచరులు చెబుతున్నారు. అయితే వీరిలో ఒక్కరిద్దరికి మినహా కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టే స్తోమత లేని వారు కూడా ఉన్నట్లు ప్రచారం. ఇక పోతే టికెట్ ఆశిస్తున్న వారిలో ఉద్యోగులు, వ్యాపారవేత్తలు ఉన్నాయి. అయితే వీరు ఇప్పటి వరకు ప్రజల్లో లేని నాయకులు, పార్టీ కోసం పనిచేయకుండా ఎన్నికల సమయంలో వచ్చిన వారు కొందరు ఉన్నారు. అలాగే ఇతర జిల్లాల నుంచి కూడా తీవ్ర పోటీ ఉంది. ఈ నేపథ్యంలో ఎవరికి టికెట్ ఇస్తారు.. ఎవరిని బుజ్జగిస్తారో వేచి చూడాల్సిందే.

వినతులు వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్

మహబూబాబాద్: ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, జెడ్పీ సీఈఓ రమాదేవి వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం అనే విషయాన్ని అధికారులు గుర్తు పెట్టుకుని పెండింగ్ వినతులు కూడా పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో 135 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. సీపీఓ సుబ్బారావు, అధికారులు ఉన్నారు.

వచ్చిన వినతుల్లో కొన్ని..
తమ కాలనీలో సెల్ టవర్ నిర్మాణం చేస్తున్నారని, దాంతో ఆరోగ్య సమస్యలు వస్తాయని, నిర్మాణం నిలిపివేయించాలని మానుకోట మున్సిపాలిటీ పరిధి నందీనగర్ కాలనీవాసులు వినతిలో పేర్కొన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధి అనంతారం గ్రామానికి చెందిన దివ్యాంగుడు శ్రీధర్ తనకు పింఛన్ ఇప్పించాలని కోరాడు. కేసముద్రం మండలం అర్పనపల్లి గ్రామానికి చెందిన పలువురు తమ గ్రామ శివారులోని చెరువును కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతిలో పేర్కొన్నారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చి న్యాయం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు, అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు మట్టూరి నాగేశ్వర్‌రావు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కమిటీ సమావేశం నిర్వహించకుండా డీపీఆర్వో శ్రీనివాసరావు అడ్డంకులు సృష్టిస్తున్నారని, కమిటీని కూడా తప్పుదోవ పట్టిస్తున్నారని, వెంటనే కమిటీ సమావేశం నిర్వహించాలని వినతిలో పేర్కొన్నారు.

సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాలి
సాధారణ ప్రసవాలపై గర్భిణులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వైద్యశాఖ అధి కారులతో శాఖ కార్యకలాపాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ ప్రసవాలను పెంచాలని, అందుకు గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ పీహెచ్‌సీలో వందశాతం గర్భిణులు నమోదై ఉండాలన్నారు. కిందిస్థాయి సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేసి పనితీరును పెంచాలన్నారు. ఓపీ పెరగాలని, డాక్ట ర్లు అందుబాటులో ఉండాలని, లక్ష్యాలను రూపొందించుకొని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కొత్తగూడ, గంగారం వంటి ఏజెన్సీ మండలాల్లో తప్పనిసరిగా పర్యటించి పీహెచ్‌సీల పనితీరును పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ వైద్యంపై నిరుపేదల్లో నమ్మకం పెరిగేలా వైద్య సిబ్బంది అంకితభావంతో పని చేయాలన్నారు. సమీక్షలో డీఎంహెచ్‌ఓ అంబరీష, అధికారులు పాల్గొన్నారు.

7, 8 తేదీల్లో రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 7, 8వ తేదీల్లో రాష్ట్ర స్థాయి అండర్-15, 20 రెజ్లింగ్ చాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ సంఘం కార్యదర్శి కరీం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈనెల 11 నుంచి మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

మార్కెట్‌లో దోపిడీ



కేసముద్రం మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మిర్చి బస్తాలు

- కేసముద్రం మార్కెట్‌లో మిర్చి రైతులను ముంచుతున్న వ్యాపారులు
- సరైన ధర పెట్టడం లేదని రైతుల ఆవేదన
- కొన్ని కూట్లకే అత్యధిక ధర..
- 3శాతం క్యాష్ కటింగ్‌తో మరింత నష్టం

కేసముద్రం: మిర్చి రైతులు దోపిడీకి గురవుతున్నారు. తెగుళ్ల బెడదతో తక్కువ దిగుబడి రాగా.. కొద్దిపాటి సరుకును అమ్ముకుందామంటే మార్కెట్‌లో వ్యాపారులు దర్జాగా మోసం చేస్తున్నారు. కొంతమంది రైతులకు మాత్రమే మంచి ధరపెట్టి.. మిగతా వారందరికీ భారీగా తగ్గించి ధర పెడుతున్నారు. అలాగే 3శాతం క్యాష్ కటింగ్ పేరుతో కొందరు వ్యాపారులు రైతులను నిలువునా దోచుకుంటున్నారు.

వ్యాపారుల కుమ్మక్కు..
కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో గత నెల 30న మిర్చి కొనుగోళ్లను ప్రారంభమయ్యాయి. అప్పటికే మార్కెట్ బయట పలువురు వ్యాపారులు ఇష్టానుసారంగా మిర్చికి ధరను నిర్ణయించి కొనుగోలు చేశారు. ఈక్రమంలో క్యాష్ కటింగ్ చేస్తూ రైతుల అవసరాలను బట్టి నిలువునా దోచుకున్నారు. దీంతో మార్కెట్ ఆదాయానికి గండి పడింది. అయితే మార్కెట్‌లో కొనుగోళ్లు ప్రారంభమైనా దోపిడీ మాత్రం ఆగడం లేదు. వ్యాపారులు కుమ్మక్కై కొన్ని కూట్లకే క్వింటాకు రూ.20 వేలకు పైగా ధర పెట్టి.. మిగిలిన కూట్లకు రూ. 15 వేల నుంచి రూ.17వేల వరకు ధరను పెడుతూ మోసం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు తూకంలోనూ తేడాలు వస్తున్నాయని ఆరోపిస్తున్నారు. 100 నుంచి 400 గ్రాముల వరకు లెక్కించడంలేదు. ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి దిగుబడి తగ్గడం, వచ్చిన మిర్చిని అమ్ముదామంటే తక్కువ ధర, క్యాష్ కటింగ్‌తో మోసం చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా మార్కెట్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదంటూ వాపోతున్నారు.

ధరలు ఇలా..
కాగా సోమవారం మార్కెట్‌కు తేజ మిర్చి 1,747 బస్తాలు అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ఠ ధర రూ.21,899, కనిష్ఠ ధర రూ.10,809 పలికింది. తాలురకం మిర్చికి క్వింటాకు గరిష్ఠ ధర రూ.12,251, కనిష్ఠ ధర రూ.11,011 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

రైతులను ఇబ్బందిపెడితే చర్యలు
మిర్చి కొనుగోళ్లపై రైతు సంఘాల, వ్యాపారుల మధ్య జరిగిన చర్చల ప్రకారం సరుకు ఖరీదు చేయాలి. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం.
- అమరలింగేశ్వర్‌రావు, మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి

3 శాతం చొప్పున రూ.7వేలు కటింగ్ చేశారు



నాకున్న నాలుగుఎకరాల్లో మిర్చి పంట సాగు చేశా. తెగుళ్ల కారణంగా కేవలం 13 క్వింటాళ్ల మిర్చి చేతికి వచ్చింది. మొత్తంగా పంటకు రూ.4లక్షల వరకు పెట్టుబడి పెట్టిన. మార్కెట్‌లో మిర్చి అమ్మడానికి వెళ్తే క్వింటాకు ధర రూ.21వేలు పెట్టారు. డబ్బులు ఇచ్చేటప్పుడు వ్యాపారి 3శాతం చొప్పున రూ.7వేలు కటింగ్ చేశాడు. పైగా తూకంలో గ్రాములను లెక్కించలేదు.
-అంబటి బిక్షం, అమీనాపురం, కేసముద్రం

రూ.17,520 ధర పెట్టింద్రు



నాకున్న ఎకరంలో రూ.లక్ష పెట్టుబడి పెట్టి మిర్చి పంట సాగుచేశా. కేవలం 2 క్వింటాళ్లే దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో అమ్ముదామని వస్తే ధర రూ.17,520 పెట్టారు. కొన్ని కూట్లకు మాత్రమే ధర రూ.20వేలు పెట్టి, మిగిలిన కూట్లకు ధర రూ.15 వేల నుంచి రూ.17వేల వరకు పెట్టి మోసం చేశారు. ఎవరికి చెప్పుకోవాల్నో తెల్వక అమ్ముకున్నా.
-బానోతు వస్రాం, సింగారం, మానుకోట

షాపుల తనిఖీ

కేసముద్రం: మండల కేంద్రంలోని పలు దుకాణాలను డీఎల్‌పీఓ గంగాభవాని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్రేడ్ లైసెన్స్‌లపై రెన్యూవల్ చేసుకోని పలు షాపులను ఆమె బంద్ చేయించి తాళాలు వేస్తుండగా.. యజమానులు వాగ్వాదానికి దిగారు. ముందస్తుగా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా షాపులకు తాళాలు ఎలా వేస్తారంటూ షాపు యజమానులు ప్రశ్నించారు. అదే సమయంలో అక్కడున్న కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి ఈ విషయాన్ని ఎమ్మెల్యే మురళీనాయక్‌కు ఫోన్ ద్వారా తెలిపాడు. దీంతో ఎమ్మెల్యే స్పందించి, వెంటనే డీఎల్‌పీఓకు ఫోన్ చేసి షాపులను బంద్ చేస్తే వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తుతాయని, వారికి గడువు ఇవ్వాలని ఆయన సూచించనట్లు తెలిసింది. కాగా 98 షాపులు ట్రేడ్‌లైసెన్స్‌లను రెన్యూవల్ తెలిపారు.

నిధులు కరువు.. సేవకు సెలవు!

- ఎన్‌ఎస్‌ఎస్‌కు నిధుల పెంపు.. విడుదలలో జాప్యం
- మొత్తం రావాల్సిన నిధులు రూ. 2.67 కోట్లు
- విడుదలైనవి రూ.47 లక్షలు
- కానరాని ప్రత్యేక శిబిరాలు
- పీఎఫ్ఎంఎస్ అకౌంట్లు తీసినా నిధుల వినియోగానికి ఇబ్బందులే

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) సామాజిక సేవల్లో ముందుండేది. రాష్ట్రపతి చేతుల మీదుగా కూడా అవార్డు అందుకున్న ఘనత ఉంది. కానీ ప్రస్తుతం పూర్తిస్థాయిలో నిధులు విడుదలవ్వక సేవలు అంతంతమాత్రంగానే అందించే పరిస్థితి కనిపిస్తోంది. కేంద్రం విడుదల చేసే నిధుల వినియోగంలో అనేక ఆంక్షలుండడంతో సామాజిక సేవా కార్యక్రమాలకు ముందడుగు వేసే పరిస్థితి కనిపించడం లేదు.

నిధుల పెంపు..
కేయూ పరిధిలో ఎన్ఎస్ఎస్ ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల్లో కలిపి మొత్తం 356 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఉన్నాయి. ఒక్కో యూనిట్‌కు 100మంది చొప్పున మొత్తం 35,600లమంది వలంటీర్లున్నారు. స్వచ్ఛభారత్, ప్రజల్లో చైతన్యం కలిగించడం ఇలా అనేక సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ సందర్భంగా వలంటీర్లకు స్నాక్స్, బ్యానర్లు, సమావేశాలకు సంబంధించిన కార్యక్రమాలకు నిధులు వెచ్చిస్తారు. గతంలో ఒక్కో యూనిట్‌కు రెగ్యులర్ కార్యక్రమాలకు రూ.16 వేలు ఉండేది. ఇప్పుడు రూ 27,500లకు పెంచారు. అదేవిధంగా ఎన్ఎస్ఎస్ యూనిట్‌చే వారం రోజులు ఏదైనా గ్రామంలో 50 మంది వలంటీర్లతో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తే గతంలో 22,500లు ఇచ్చేవారు. దాన్ని రూ.35 వేలకు పెంచారు.

కొత్తగా పీఎఫ్ఎంఎస్ అకౌంట్లు
ఎన్ఎస్ఎస్‌కు విడుదల చేసే నిధులను జవాబుదారీతనంగా వెచ్చించేలా కేంద్ర ప్రభుత్వం 'మై భారత్ పోర్టల్'ను తీసుకొచ్చింది. ఆతర్వాత కొత్త పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (పీఎఫ్ఎంఎస్) ద్వారా బ్యాంకుల్లో ప్రతీ కళాశాలకు సంబంధించిన ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఖాతాలను ఓపెన్ చేయాలనడంతో ఎక్కువ శాతం కాలేజీలు ఓపెన్ చేశాయి. కొన్ని కళాశాలలు ఇంకా పీఎఫ్ఎంఎస్ అకౌంట్లు కూడా తీయలేదు.

రూ.47 లక్షల నిధులే విడుదల
కేయూ పరిధిలో ఎన్ఎస్ఎస్‌కు గత విద్యాసంవత్సరంలో నిధులు విడుదల కాలేదు. ఈ విద్యాసంవత్సరం రూ.2.67 కోట్ల నిధులు విడుదల కావాల్సి ఉండగా.. రూ.47 లక్షలు విడుదలయ్యాయి. కొద్దిరోజుల క్రితం నిధులు తక్కువగా ఉండటంతో కేవలం 171 యూనిట్లకు ఒక్కో యూనిట్‌కు రూ 27,500 చొప్పున ఆయా కళాశాలల యూనిట్లకు అధికారులు విడుదల చేశారు. ఆ నిధులన్నీ రెగ్యులర్ కార్యక్రమాలకే వెచ్చించాల్సి ఉంటుంది. విద్యార్థులు ఎక్కువగా ఉండే కళాశాలల్లో నాలుగైదు యూనిట్లు కూడా ఉంటాయి. కళాశాలలో ఎన్ని యూనిట్లు ఉన్నా.. ఒక్క యూనిట్‌కు మాత్రమే రూ 27,500 చొప్పున వేశారు. గతంలో ప్రత్యేక శిబిరాల నిర్వహణ అనంతరం బిల్లులు పెట్టుకుంటే వర్సిటీ అధికారులు చెల్లించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో శిబిరాలు నిర్వహించడం లేదని తెలుస్తోంది. ఈసారి ఎన్ఎస్ఎస్ యువజనోత్సవాలు కూడా జరగలేదు.

రెమ్యూనరేషన్ ఏది?
కేయూ పరిధిలో 356 మంది ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు రెండేళ్ల నుంచి రెమ్యూనరేషన్ విడుదల కాలేదు. గతంలో వీరికి ఒక్కొక్కరికి రూ. 6 వేలు ఉండగా.. రూ.8,500లకు పెంచారు. కానీ విడుదల చేయడం లేదు. దీంతో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలపట్ల వారు కూడా విముఖత చూపుతున్నారు. నూతన విధానంతో అనేక ఇబ్బందులతో రాబోయే కాలంలో ఎన్ఎస్ఎస్ యూనిట్లు తగ్గిపోయే అవకాశం కూడా ఉంది.



నిధులు ఖర్చు చేయాలంటే ఇబ్బందులే
గతంలో వర్సిటీ అధికారులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు ఉమ్మడి జిల్లాల స్థాయిలో సమావేశాలు నిర్వహించి రెగ్యులర్ కార్యక్రమాల నిర్వహణకు నిధుల విడుదల చేసేవారు. పీఎఫ్ఎంఎస్ అకౌంట్, నిబంధనలు, పలు ఆంక్షలతో నిధులను వినియోగించుకోలేకపోతున్నారు. ఈనిధుల వినియోగానికి సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్ అనుమతి ఉండాలి. ఇదంతా ఒక ఎత్తయితే పలు సాంకేతిక సమస్యలూ తలెత్తుతున్నాయని కళాశాలల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, కేయూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గత నెల 29న వరంగల్ కేంద్రంగా, 30న ఖమ్మం జిల్లాలో, 31న ఆదిలాబాద్‌లో ప్రోగ్రాం ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. అయినప్పటికీ ఇబ్బందుల తప్పడం లేదని ప్రోగ్రాం ఆఫీసర్లు వాపోతున్నారు.

తక్కువ నిధులు విడుదలయ్యాయి..



కేయూ పరిధిలో 356 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఉండగా.. రూ.2.67 కోట్లు రావాల్సి ఉంది. కానీ రూ.47 లక్షల నిధులే విడుదలయ్యాయి. అందులో 171 యూనిట్లకు విడుదల చేశాం. అయితే ఆనిధులను వినియోగంపై అవగాహన కల్పించాం. ఈనిధులు పూర్తిగా వినియోగిస్తే మరోసారి విడుదలయ్యే అవకాశం ఉంది. నిధుల కొరత ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలపై ప్రభావం చూపుతోంది.
- ఆచార్య ఈసం నారాయణ, కేయూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్

'గృహజ్యోతి'కి డిస్కం సన్నద్ధం

- గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- నేటి నుంచి తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ నంబర్ల నమోదు

హన్మకొండ: ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకం అమలుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈపథకం కింద గృహాలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల అమలులో ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10లక్షలకు పెంపును అమల్లోకి తీసుకొచ్చారు. ఇటీవల మరో రెండు పథకాలు అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈమేరకు గృహజ్యోతి పథకం అమలుకు వినియోగదారుల రేషన్ కార్డు, ఆధార్ కార్డు నంబర్లను విద్యుత్ సర్వీస్ నంబర్‌తో అనుసంధానం చేయాలని నిర్ణయించింది. దీంతో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రిజ్వీ డిస్కంలకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

నేటి నుంచి ప్రక్రియ షురూ..
టీఎస్ ఎన్పీడీసీఎల్‌లోని 16 జిల్లాల్లో 45,64,889 మంది గృహ వినియోగదారులున్నారు. ఈనెల 6 నుంచి బిల్లులు తీస్తున్నప్పుడే మీటర్ రీడింగ్‌తో పాటు వినియోగదారులను కలిసి రేషన్ కార్డు, ఆధార్ నంబర్లు తీసుకుని నమోదు చేయాలని సూచించారు. ఈమేరకు సిద్ధం చేస్తున్న సాఫ్ట్‌వేర్ మంగళవారం(నేడు) ఉదయానికి అందుబాటులోకి రానుంది. ప్రతి ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయం (ఈఆర్‌ఓ)లో ఉదయం 9 గంటలకు స్పాట్ బిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, డివిజన్ ఇంజనీర్లు సాఫ్ట్‌వేర్ వినియోగం, మీటర్ రీడింగ్, రేషన్ కార్డు, ఆధార్ నంబర్ల నమోదుపై అవగాహన కల్పించాలని ట్రాన్స్‌కో సీఎండీ.. జిల్లా ఎస్ఈలు, డీఈలు, అకౌంట్స్ ఆఫీసర్లను ఆదేశించారు. ఈమేరకు టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో డివిజన్ల వారీగా సమావేశాల ఏర్పాటుకు సిద్ధమవుతున్న అధికారులు మీటింగ్‌కు రావాలని స్పాట్ బిల్లర్ల కు సమాచారం పంపారు. ఇదిలా ఉండగా.. అద్దెకు ఉంటున్న కుటుంబాల ఆధార్, రేషన్ కార్డు నంబర్ల నమోదుపై అధికారులు సందేహాలు వ్యక్తం చేయగా నివృత్తి చేశారు. అద్దెకు ఉంటున్న ఇంటి మీటర్ నంబర్‌తో పాటు వారి రేషన్ కార్డు, ఆధార్‌నంబర్ నమోదు చేయాలని సూచించారు. ఈ ప్రక్రియతో యజమానులకు ఎలాంటి సమస్యలు తలెత్తవని చెప్పారు. ప్రతి నెలా 15వ తేదీలోపు విద్యుత్ పంపిణీ సంస్థ బిల్లులు జారీ చేస్తుంది. ఈనెల 15వ తేదీ నాటికి తెల్ల రేషన్‌కార్డు వినియోగదారులు ఎంత మంది ఉన్నారో స్పష్టంగా తెలుస్తుంది.



జిల్లాల వారీగా గృహ వినియోగదారులు

జిల్లా	వినియోగదారులు
హనుమకొండ	3,45,302
వరంగల్	2,86,156
భూపాలపల్లి, ములుగు	1,93,257
జనగామ	1,69,375
మహబూబాబాద్	2,09,066

క్లుప్తంగా

భూన్యాయ శిబిరాలు వాయిదా

పెద్దవంగర: రైతులకు ఉచితంగా న్యాయ సలహాలు ఇచ్చేందుకు చేపట్టిన భూన్యాయ శిబిరాలను వాయిదా వేసినట్లు లీఫ్స్ సంస్థ సలహాదారు కేతిరెడ్డి కరుణాకర్ దేశాయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం చిన్నవంగర గ్రామంలో ఈ నెల 7,8, బొమ్మకల్లులో 16,17, అలాగే, జనగామ జిల్లా పాలకుర్తి మండలం బొమ్మెర గ్రామంలో 12,13 తేదీల్లో నిర్వహించనున్న భూన్యాయ శిబిరాలను మరో తేదీల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. లీఫ్స్ సంస్థ అధ్యక్షుడు సునీల్ కుమార్ తండ్రి సోమవారం కన్నుమూశారు. దీంతో న్యాయ శిబిరాలను వాయిదా వేస్తున్నట్లు కేతిరెడ్డి వెల్లడించారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

బచ్చన్నపేట : మండలంలోని సాల్వాపూర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం గ్రామానికి చెందిన ఓ యువకుడు అదే గ్రామానికి చెందిన ఓ బాలికపై లైంగికదాడికి యత్నించినట్లు సమాచారం. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిసింది. దీంతో పోలీసులు సదరు యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

జువైనల్ హోమ్‌కు బాలుడి అప్పగింత

నెల్లికుదురు: బాలిక ఆత్మహత్యకు కారణమైన ఓ బాలుడిని జువైనల్ హోమ్‌కు అప్పగించినట్లు ఎస్సై కె.క్రాంతికిరణ్ తెలిపారు. ఇనుగుర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక సెల్‌ఫోన్‌కు నెల్లికుదురు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడు నిత్యం అసభ్యకర మెస్సేజ్‌లు పంపుతున్నారు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక గత నెల 28న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ ఘటనలో బాలిక మృతికి కారణమైన బాలుడిని సోమవారం వరంగల్‌లోని జువైనల్ హోమ్‌కు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

నర్సింహులపేట: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై గండ్రాతి సతీష్ కథనం ప్రకారం నర్సింహులపేటకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి వేముల ప్రభాకర్‌రెడ్డి తన భార్యతో కలిసి 15 రోజుల క్రితం విజయవాడలో ఉంటున్న తమ కుమారుడి వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో సోమవారం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోని లాకర్‌లో ఉన్న 8 తులాల బంగారం కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గ్రహించిన ప్రభాకర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకుని క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు



సారలమ్మ గద్దె వద్ద పూజలు చేస్తున్న మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్



ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాట్ల మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి

- ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయం ప్రకారం జాతర
- మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క
- అధికారులతో సమీక్ష సమావేశం

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారం జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. సోమవారం మేడారంలోని హరితహోటల్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ఆర్టీసీ ఎండీ సజ్జనార్..అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ మేడారం.. దేశంలోనే పెద్ద వన జాతరని, భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. జాతరకు 6 వేల ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం జాతర నిర్వహిస్తామన్నారు. 16వ తేదీ నుంచి ఆర్టీసీ క్యాంప్ భక్తులకు అందుబాటులో ఉంటుందన్నారు. జాతర సమయంలో సమస్యలు తలెత్తకుండా ఆర్టీసీ ఎండీ ఆధ్వర్యంలో 10 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు జాతర సమయంలో కూడా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మేడారం జాతరలో ఆర్టీసీ.. ఇప్పటి వరకు లక్షా పదివేల మంది భక్తులకు సేవలు అందించిందని తెలిపారు. 70 వేల మంది మహిళలు ఆర్టీసీ ఉచిత ప్రయాణ సేవలు వినియోగించుకున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రతి రెండేళ్లకోసారి జరిగే మహాద్భుత ఘట్టం మేడారం జాతరని, భక్తుల సౌకర్యార్థం రూ. 105 కోట్లతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, పీఓ అంకిత్, ఎస్పీ శబరీశ్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, అధికారులు పాల్గొన్నారు. అనంతరం మేడారం ఆర్టీసీ బస్టాండ్‌లో నాలుగు లహరి నాన్ ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సులను మంత్రులు పొన్నం, సీతక్క ప్రారంభించారు. అనంతరం వీఐపీ పార్కింగ్ వరకు బస్సులో ప్రయాణించారు.

ఆర్టీసీ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

మేడారంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాతరకు వచ్చే బస్సులు, పార్కింగ్ స్థలాలు, బస్ షెల్టర్లు, క్యూలైన్ వార్డులు, ఆర్టీసీ ఉద్యోగుల షెల్టర్లు, తదితర వివరాలను ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ఉన్నతాధికారులు మంత్రులకు వివరించారు. అనంతరం మంత్రులు సమ్మక్క–సారలమ్మను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ సంప్రదాయ ప్రకారం ఈఓ రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు డోలువాయిద్యాలతో మంత్రులు, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారిని సన్మానించి ప్రసాదం అందజేశారు.

పోలీసుల అదుపులో చిట్‌ఫండ్ యాజమాన్యం?

- మృతుడు, డైరెక్టర్ భాస్కర్ రెడ్డి సూసైడ్ నోట్ లభ్యం
- దీని ఆధారంగా తిరుపతిరెడ్డి, కమలాకర్‌రెడ్డి అరెస్టు!
- న్యాయం చేయాలని బాధితుల ఆందోళన



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

వరంగల్ క్రైం/ హసన్‌పర్తి : కనకదుర్గ చిట్‌ఫండ్ డైరెక్టర్ నల్ల భాస్కర్ రెడ్డి(35) ఆత్మహత్య కేసులో పోలీసులు యాజమాన్యాన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. హనుమకొండలోని హోటల్ హరిత కాకతీయలో ఆదివారం ఆత్మహత్యకు పాల్పడిన భాస్కర్‌రెడ్డి (35) మృతి కేసు పలు మలుపులు తిరిగింది. తన ఆత్మహత్యకు కనకదుర్గ చిట్‌ఫండ్ యాజమాన్యం రాగిడి తిరుపతిరెడ్డి, కమలాకర్‌రెడ్డి కారణమంటూ భాస్కర్‌రెడ్డి సూసైడ్ నోట్ లభించడం సంచలనంగా మారింది. సూసైడ్ నోట్‌లో చిట్‌ఫండ్ యాజమాన్యం కారణమని ఉండడంతో మృతుడి కుటుంబీకులు, బంధువులు కేయూ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు చిట్‌ఫండ్ యాజమాన్యం రాగిడి తిరుపతిరెడ్డి, కమలాకర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కమలాకర్‌రెడ్డిని కేయూ పోలీసులు అదుపులోకి తీసుకుని సుబేదారి పోలీసులకు అప్పగించారు. కాగా, రాగిడి తిరుపతిరెడ్డి మోసం కారణంగా భాస్కర్ రెడ్డి మృతి చెందాడని, ఈ ఘటనపై తిరుపతిరెడ్డిపై చర్యలు తీసుకుని కష్టమర్ల డిపాజిట్లను వెంటనే తిరిగి ఇవ్వాలని మృతుడి బంధువులు డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకూ అంత్యక్రియలు జరమని తేల్చి చెప్పడంతో పోలీసులు చొరవ తీసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో భాస్కర్ రెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, చిట్‌ఫండ్ యాజమాన్యం పోలీసులు అదుపులో ఉన్నప్పటికీ పోలీసు ఉన్నతాధికారులు మాత్రం ధ్రువీకరించడం లేదు. ఈ విషయంపై సుబేదారి సీఐ షూకుర్‌ను వివరణ కోరగా భాస్కర్‌రెడ్డి కుటుంబీకులు సూసైడ్ నోట్ అందజేశారన్నారు. దీంతో ఈ కేసులో సెక్షన్లు మార్పు చేశామన్నారు. భాస్కర్‌రెడ్డి ఆత్మహత్యకు యాజమాన్యమే కారణమనే ఆరోపణలపై వారిని వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసినట్లు సీఐ తెలిపారు.

కాజీపేట జంక్షన్‌లో అయోధ్య రైలు



కాజీపేటలో అయోధ్య రైలు వద్ద రైల్వే అధికారులు

కాజీపేట రూరల్: సికింద్రాబాద్–అయోధ్య వెళ్లే ప్రత్యేక రైలు సోమవారం సాయంత్రం 6:40 గంటలకు చేరుకుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెక్యూరిటీ రీజన్స్ దృష్ట్యా ఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ శైలేశ్‌కుమార్, కాజీపేట సీఐ సంజీవరావు, కాజీపేట స్టేషన్ మేనేజర్ సత్యనారాయణ, రైల్వే సీసీఐ సజ్జన్‌లాల్, అన్ని విభాగాల సూపర్‌వైజర్లు, రైల్వే అధికారులు, మెకానిక్ సిబ్బంది ప్రత్యేక రైలు వద్దకు చేరుకున్నారు. 6:55 గంటలకు బయల్దేరి వెళ్లింది. కాగా.. ఈ రైలులో కాజీపేట జంక్షన్ నుంచి ఎవరూ ఎక్కలేదని రైల్వే అధికారులు తెలిపారు.

నేడు ప్రత్యేక రైళ్ల సర్వీస్‌ల ప్రారంభం

కాజీపేట జంక్షన్ నుంచి కాజీపేట–అయోధ్య వరకు మంగళవారం నుంచి ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రారంభించనున్నారు. ఈమేరకు మంగళవారం అయోధ్య రైలును ప్రారంభించి పంపించే ఏర్పాట్లలో ఉన్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈరైలు కాజీపేట జంక్షన్ నుంచి మంగళవారం సాయంత్రం 6:20 గంటలకు బయల్దేరి వెళ్లనున్నట్లు తెలిపారు. 20 బోగిలతో కూడిన ఈప్రత్యేక రైలులో ఉమ్మడి జిల్లా నుంచి 1,300 మంది ప్రయాణికులు కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి వెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు. బీజేపీ నాయకులు, అధికారులు అయోధ్య ప్రత్యేక రైలు అధికారికంగా పంపించే కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. కాజీపేట జంక్షన్ నుంచి అయోధ్యకు ప్రయాణికులు వెళ్లనున్నట్లు తెలిపారు. కాజీపేట–అయోధ్య, అయోధ్య–కాజీపేట (07223/07223) మధ్య 30 రైళ్ల సర్వీస్‌లను మార్చి 2వ తేదీ వరకు ప్రవేశపెట్టి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్ మధ్య ప్రత్యేక రైళ్లు

- ఈ నెల 8 నుంచి అమలు

కాజీపేట రూరల్ : ప్రయాణికుల సౌకర్యార్థం కాజీపేట జంక్షన్ మీదుగా సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్ స్టేషన్ వరకు 16 రైళ్ల సర్వీస్‌లను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. ప్రత్యేక రైళ్ల సర్వీస్‌ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8వ తేదీ నుంచి మార్చి 28వ తేదీ వరకు, సుబేదార్‌గంజ్–సికింద్రాబాద్ (04121) ఎక్స్‌ప్రెస్ ప్రతి శుక్రవారం కాజీపేట జంక్షన్‌కు 18.00 గంటలకు చేరుకుంటుంది. అదేవిధంగా ఈ నెల 10వ తేదీ నుంచి మార్చి 30వ తేదీ వరకు సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్ (04122) ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం కాజీపేటకు ఉదయం 8.00 గంటలకు చేరుకుటుంది. ఈ రైలుకు కాజీపేట సబ్ డివిజన్ పరిధిలో నాగపూర్, బల్లార్షా, సిర్పూర్‌కాగజ్‌నగర్, మంచిర్యాల, పెద్దపల్లి, కాజీపేట రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ కల్పించారు.

భవ్య కుటుంబీకుల రాస్తారోకో

- తప్పుడు ప్రచారంపై ఆగ్రహం



రాస్తారోకో చేస్తున్న భవ్య కుటుంబ సభ్యులు

ఖానాపురం: యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో అనుమానాస్పద స్థితిలో ఇరువురు విద్యార్థినులు మృతి చెందిన విషయం విధితమే. కాగా, ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామానికి చెందిన కోడి భవ్య మృతదేహాన్ని ఆదివారం సాయంత్రం స్వగ్రామానికి తీసుకొచ్చి జిల్లేడు చెట్టుతో వివాహం జరిపించి అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం భవ్య మృతికి కారకులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ గ్రామంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఆటోడ్రైవర్‌తో పాటు వార్డెన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే రాస్తారోకో వద్దకు చేరుకుని స్పష్టమైన హామీ ఇవ్వాలని బైఠాయించారు. మృతదేహంతో రోడ్డుపైనే నిలవడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై మాధవ్‌గౌడ్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకుని సముదాయించే ప్రయత్నం చేశారు. కాగా, సామాజిక మాధ్యమాల్లో భవ్య అనారోగ్యంతో మృతి చెందిందని తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేను పిలిపిస్తేనే రాస్తారోకో విరమిస్తామని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తప్పుడు ప్రచారం చేసిన వారిపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

వారిని శిక్షించండి..

'నా కూతురును చంపిన వారిని చంపేయండి.. అన్యాయంగా నా బిడ్డను పొట్టనబెట్టుకున్నారు..నా బిడ్డ మృతిపై అనుమానాలు ఉన్నాయి..అందరు కలిసి మా కుటుంబానికి అన్యాయం చేత్తాండ్లు.. నా బిడ్డ ఒంటిపై దెబ్బలు ఉన్నాయి. చంపినోళ్లను వదిలేయవద్దంటూ' భవ్య తల్లి లలిత రోదించిన తీరు గ్రామస్తులను కలచివేసింది. నా బిడ్డను చంపినవారిని వదిలేయొద్దు. వారిని కఠినంగా శిక్షిస్తేనే నా బిడ్డ ఆత్మ శాంతిస్తదంటూ బోరున విలపించారు. కాగా, ఎస్సై మాధవ్‌గౌడ్.. భవ్య అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

- పూజలు.. మేకపిల్ల బలి
- పెద్దపహాడ్‌లో అర్ధరాత్రి హల్‌చల్..
- రెండు బైక్‌లు వదిలి కారులో పరార్
- 100 డయల్‌కు ఫోన్.. పోలీసుల విచారణ
- అదుపులో ఇద్దరు వ్యక్తులు



తవ్వకాలు చేపట్టిన గుంతలో మేక పిల్ల

జనగామ: జనగామ మండల పరిధి పెద్దపహాడ్ గ్రామం వెంకిర్యాలకు వెళ్లే దారి.. దండు సిద్దులు, కాటబోయిన రాములు వ్యవసాయ బావి వద్ద కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టినట్లు మాట్లాడుకుంటున్నారు. రెండు బైక్‌లు, ఓ కారులో అక్కడికు వచ్చిన వ్యక్తులు గతంలో ఉన్న గుంతలో నిమ్మకాయలతో పూజలు చేసి మేక పిల్లను బలిచ్చి అందులో వేశారు. సిద్దులు స్నేహితుడు అదే రోజు రాత్రి వెంకిర్యాలకు వెళ్తుండగా వ్యవసాయ బావి వద్ద కారు, బైక్‌లు అనుమానాస్పదంగా కనిపించడంతో సమీపానికి చేరుకున్నాడు. మనుషుల కదలికలు కనిపించడంతోపాటు పాకలో ఉన్న పశువులు బయటకు వచ్చి అరుస్తుండగా.. సిద్దులుకు గ్రామస్తులకు ఫోన్ చేయడంతో అక్కడికి చేరుకున్నారు. ఇంతలోనే గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌లు అక్కడే వదిలేసి కారులో పారిపోయినట్లు సిద్దులు తెలిపారు. 100 నంబర్‌కు డయల్ చేయగా పోలీసులు వచ్చి విచారణ చేపట్టి బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఏడాదిన్నర క్రితం ఇదే ప్రదేశంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరగ్గా.. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాజా సంఘటనకు సంబంధించి ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఎస్సై సృజన్ మాట్లాడుతూ గుప్త నిధుల కోసం తవ్వకాలు చేయలేదని, ఇంట్లో కుటుంబ సభ్యులకు ఆరోగ్యం బాగోలేక పోవడంతో అడవిలో పూజలు చేసినట్లు చెబుతున్నారని పేర్కొన్నారు. సంబంధిత వ్యక్తుల ఇళ్లలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఉన్నట్లు వెల్లడించారు.

రూ.200 కోట్లతో 'టెక్నికల్ హబ్'

- కార్యరూపం దాల్చనున్న మంత్రి సురేఖ కృషి
- తెలంగాణలో ఏకైక టెక్నికల్ సెంటర్

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లాలో రూ.200 కోట్ల వ్యయంతో టెక్నికల్ హబ్ ఏర్పాటుకు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేసిన కృషి ఫలించింది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 20 టెక్నికల్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించగా.. వాటిలో ఒక హబ్ ఖిలా వరంగల్ మండల పరిధి రంగశాయిపేటలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. మూడు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం.. మంత్రి కొండా సురేఖ పట్టుదలతో చేసిన ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. వరంగల్ జిల్లా కేంద్రంలో టెక్నికల్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర మంత్రి మండలి సోమవారం అంగీకారం తెలిపింది. ఈ టెక్నికల్ సెంటర్ భవన నిర్మాణం, ప్లాంట్, యంత్రాల ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.200 కోట్లు పెట్టుబడిగా పెట్టనుంది. నగరంలో స్థాపించనున్న ఈ సెంటర్‌ను విశేషమైన సామర్థ్యంతో నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అధునాతన సాంకేతికతను సమకూర్చడం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల సృష్టి, సాంకేతిక నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక, వ్యాపార సలహాలు అందించడం వంటి అంశాల్లో ఈ టెక్నికల్ సెంటర్ ప్రధాన పాత్ర పోషించనుంది. పలు రకాల పరిశ్రమలకు అవసరమైన సేవలను అనుసరించి టెక్నికల్ సెంటర్ శిక్షణా కార్యక్రమాలను చేపడుతోంది. నిర్మాణ, ఎలక్ట్రికల్, ఫౌండ్రీ లెదర్, గ్లాస్, స్పోర్ట్స్ వంటి వివిధ రంగాలు టెక్నికల్ సెంటర్లు సేవలను అందిస్తాయి. టెక్నికల్ సెంటర్ ఏర్పాటు వరంగల్ జిల్లా చరిత్రలో మైలురాయిగా నిలువనుంది. వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే హబ్ ఏర్పాటు ప్రకటనతో వరంగల్ ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పట్టుదలతో వరంగల్ టెక్నికల్ సెంటర్ స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించిన మంత్రి సురేఖను ప్రజలు అభినందనలు తెలిపారు.

కుక్కల దాడి.. 25 గొర్రెల మృత్యువాత

- రూ.2.50 లక్షల నష్టం

వేలేరు : మండలంలోని శాలపల్లి శివారు లక్ష్మీతండా గ్రామంలో కుక్కల దాడిలో గుగులోత్ చిరంజీవికి చెందిన 25 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మరో పదిహేను తీవ్రంగా గాయపడ్డాయి. బాధితుడి కథనం ప్రకారం.. రోజుమాదిరి గానే గొర్రెల మందను తన వ్యవసాయ బావివద్ద కొట్టంలో ఉంచాడు. చిరంజీవి సోమవారం ఉదయం ఇంటికి వెళ్లగా కొట్టం వద్ద ఎవరూ లేని సమయంలో వీధి కుక్కలు ఒక్కసారిగా మందపై దాడి చేశాయి. ఈ దాడిలో 25 గొర్రెలు మృత్యువాత పడగా మరో పదిహేను తీవ్రంగా గాయపడ్డాయి. మృత్యువాత పడిన గొర్రెల విలువ సుమారు రూ.2.50 లక్షల వరకు ఉంటుందని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. కాగా, గ్రామంలో కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



హైనా దాడిలో దూడ..

తరిగొప్పుల: హైనా దాడిలో లేగదూడ మృత్యువాత పడింది. మండల కేంద్రానికి చెందిన పింగిళి యాదిరెడ్డి పశువుల పాకపై సోమవారం తెల్లవారుజామున హైనా దాడి చేసి అందులో ఉన్న లేగదూడను హతమార్చింది. కాగా, కొద్ది రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో హైనా దాడి చేసి దూడలను హతమారుస్తుండడంతో రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.అటవీ శాఖ అధికారులు స్పందించి హైనాను బంధించాలని కోరుతున్నారు.



గొర్రెల కళేబరాలు

కేయూ పాలకమండలి సమావేశం



కేయూ క్యాంపస్: కేయూ పాలకమండలి సమావేశాన్ని సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో నిర్వహించారు. తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఉన్నత విద్యా కమిషనర్ బుర్రా వెంకటేశం, ఫైనాన్స్ డిప్యూటీ సెక్రటరీ చంద్రకళ, కేయూ వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి పాల్గొన్నట్లు సమాచారం. ఇటీవల కేయూ రిజిస్ట్రార్, ఇతర పరిపాలనాపదవుల్లో పలువురు ప్రొఫెసర్లను నియమించిన విషయం తెలిసిందే. వీరికి సంబంధించిన ర్యాటిఫికేషన్‌ను ఈసమావేశంలో పెట్టినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బీటెక్, ఎంటెక్ పరీక్ష ఫలితాల విడుదల



పరీక్షల ఫలితాలు చూపిస్తున్న వివిధ శాఖాధిపతులు

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ కిషన్‌పుర చైతన్య (డీమ్డ్ టు బి యూనివర్సిటీ) యూజీ 3, 5 పీజీ 3 సెమిస్టర్, బీటెక్, బీఫార్మసీ 3, 5, ఎంటెక్. ఎం.ఫార్మసీ 3 సెమిస్టర్ పరీక్షల ఫలితాలను కులపతి డాక్టర్ సీహెచ్.వి.పురుషోత్తంరెడ్డి విడుదల చేశారు. యూజీ 3, 5వ సెమిస్టర్ పరీక్షల్లో మొత్తం 9,69 మంది విద్యార్థు హాజరుకాగా.. 743 మంది, పీజీ 3వ సెమిస్టర్‌లో 234 మంది పరీక్షలకు హాజరు కాగా.. 203 మంది, బీటెక్, బీఫార్మసీ 3, 5వ సెమిస్టర్లలో 591 హాజరుకాగా 432 మంది, ఎంటెక్ 3వ సెమిస్టర్‌లో హాజరైన ఆరుగురు విద్యార్థులు, ఎం.ఫార్మసీ 3వ సెమిస్టర్‌లో హాజరైన 15 మంది ఉత్తీర్ణులయ్యారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎం.రవీందర్, ఓఎస్‌డి. డా.వీరవెంకటయ్య, ఆచార్యులు జి.శంకర్‌లింగం, వి.మల్లికార్జున్, ఎస్.కవిత, ఎస్.సుమ, ఎం.జగదీశ్వర్, వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

వేర్వేరు ప్రమాదాల్లో సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో నలుగురి మృతి చెందారు. ద్విచక్రవాహనాలు అదుపు తప్పడంతో ఇద్దరు యువకులు, ఆటో, కారు ఢీకొన్న ఘటనలో మరో యువకుడు, రైలు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.



సాయిప్రసాద్ (ఫైల్)

చిల్పూరు : మండలంలోని నష్కల్ గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ మెరుగు సాయిప్రసాద్ (24) ఆదివారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి బలంగా చెట్టుకు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామానికి చెందిన బుచ్చయ్య–కమల దంపతుల కుమారుడు సాయిప్రసాద్ గ్రామంలోనే ఫొటోస్టూడియో ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం కాజీపేట మండలం వనమాలకనపర్తిలో ఫొటోలు తీసేందుకు వెళ్లాడు. రాత్రి ఇంటికి వచ్చే ముందు భార్య శ్రీవాణికి ఫోన్ చేశాడు. అర్ధరాత్రి అవుతున్నా తమ కుమారుడు ఇంటికి రాకపోవడంతో తండ్రి బుచ్చయ్య ఫోన్‌చేయగా రింగ్ అవుతున్నా లిఫ్ట్ చేయలేదు. దీంతో ప్రోగ్రాంకు పిలిచిన వారికి ఫోన్ చేసి అడుగగా ఎప్పుడో వెళ్లాడని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు, మిత్రులు వనమాల కనపర్తికి వెళ్తుండగా మార్గమధ్యలో ద్విచక్రవాహనం కనిపించింది. వెంటనే సాయిచంద్‌ను లేపే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆర్థికసాయం అందించిన జిల్లా ఫొటోగ్రాఫర్లు

తోటి ఫొటోగ్రాఫర్ మృతి చెందిన విషయం తెలియగానే సోమవారం సాయంత్రం గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థికసాయంగా రూ. 10 వేలు అందజేశారు. పరామర్శించిన వారిలో ఎంపీటీసీ పాశం శిరీష సురేష్, కర్ణకంటి వెంకటేష్, చాగంటి మణి, కేరపాటి సాంబయ్య, అనిల్, సంఘం జిల్లా కార్యదర్శి కర్ణకంటి నాగరాజు, కీర్తి ప్రవీణ్, సంతోష్, అన్వేష్, గంటె ఉపేందర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

కాసిరాజిగూడెం సమీపంలో వ్యక్తి..



జానీ మృతదేహం

డోర్నకల్: మహబూబాబాద్, ఖమ్మం జిల్లా సరిహద్దులో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో డోర్నకల్ మండలం ముల్కలపల్లికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. ముల్కలపల్లికి చెందిన ఎండీ జానీ(45) ఖమ్మం బైపాస్‌లో పాన్‌షాప్ పెట్టుకుని అక్కడే నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఖమ్మం రూరల్ మండలం కాసిరాజిగూడెం నుంచి ద్విచక్రవాహనంపై ఖమ్మం వెళ్తుండగా కాసిరాజిగూడెం సమీపంలో వాహనం అదుపు తప్పి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జానీని ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆటో, కారు ఢీ.. యువకుడి దుర్మరణం



శ్రీకాంత్ (ఫైల్)

కురవి: ఆటో, కారు ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదం ఆదివారం రాత్రి జరిగిందని సీరోలు ఎస్సై విజయ్‌రాంకుమార్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడకు చెందిన బాష్పంగు శ్రీకాంత్(28) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఆటోను నడుపుకుంటూ మహబూబాబాద్ నుంచి మరిపెడకు వెళ్తున్నాడు. మహబూబాబాద్‌కు చెందిన వెన్నం వెంకటేష్ కారును నడుపుకుంటూ హైదరాబాద్ నుంచి మహబూబాబాద్‌కు వస్తున్న క్రమంలో ఎదురెదురుగా కొత్తూరు(సీ) శివారు గుజిలి తండా సమీపంలోని రైస్‌మిల్లు వద్ద 365 జాతీయ రహదారిపై ఢీకొన్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనలో ఆటోడ్రైవర్ శ్రీకాంత్‌కు తీవ్రగాయాలు కాగా మహబూబబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి బంధువు మధుకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

డోర్నకల్: గుండ్రాతిమడుగు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. డోర్నకల్ జీఆర్పీ ఎస్సై సురేష్ కథనం ప్రకారం.. కురవి మండలం గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన కోతుల వెంకన్న(60) పశువులను మేపేందుకు సోమవారం గుండ్రాతిమడుగు రైల్వే స్టేషన్ సమీపానికి వెళ్లాడు. ఈ క్రమంలో కిలోమీటర్ నంబర్ 245 వద్ద గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతుడి కుమారుడు రఘు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

వీల్‌చైర్ బహూకరణ



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని హోప్ స్టెప్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ఆమనగల్ గ్రామానికి చెందిన దివ్యాంగ బాలిక మంజులకు సోమవారం వీల్ చైర్ బహూకరించారు. కార్యక్రమంలో టౌన్ ఎస్సై చల్లా అరుణ, ఫౌండేషన్ అధ్యక్షుడు నాగవెల్లి శ్రీనివాస్, కార్యదర్శి తంగెళ్లపల్లి శ్రీరాం, మేనేజర్ దుగ్గి రమేష్, సభ్యులు శ్రీను, రమేష్, సురేష్, యాకేష్, సుమన్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



మహబూబాబాద్ అర్బన్: ఖమ్మంలో సప్తపది గార్డెన్స్‌లో జరిగిన 11వ నేషనల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా కేంద్రంలోని సీవీ రామన్ శ్లోక కిడ్జ్ ప్లే స్కూల్ విద్యార్థులు స్పారింగ్, కటాస్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ కరస్పాండెంట్ పేర్ల రమణ సోమవారం తెలిపాడు. విద్యార్థులు 9 గోల్డ్, 7సిల్వర్, 4 బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జాస్తి ఉమాదేవి, కరాటే మాస్టర్ అమీర్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు



దంతాలపల్లి: మామిడి పంటలో నాణ్యమైన దిగుబడికి మామిడి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మల్యాల కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత డాక్టర్ రాంబాబు అన్నారు. మండలకేంద్రంలో గల రైతువేదికలో సోమవారం ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మామిడి రైతుల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తొర్రూరు డివిజన్ ఉద్యానశాఖ అధికారి రాకేష్, శాస్త్రవేత్త కిషోర్, రైతులు పాల్గొన్నారు.

సన్మానం

మహబూబాబాద్ రూరల్: యువజన కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గాడిపెల్లి చరణ్‌కుమార్‌ను ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సోమవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించడంలో ప్రతిభ చూపినందుకు హైదరాబాదులో చరణ్ కుమార్ ప్రశంసపత్రం అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, కంకర అయ్యప్పరెడ్డి, భూక్య ఉమా, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉన్నాం..

డోర్నకల్: వేసవిలో ఎదురయ్యే తాగునీటి సమస్యలపై అప్రమత్తంగా ఉన్నామని ఎంపీడీఓ చలపతిరావు తెలిపారు. మండలంలోని జోగ్యా తండాలో సోమవారం మాజీ సర్పంచ్ ఆంగోత్ సరోజతోపాటు పాలకవర్గానికి జరిగిన అభినందన సభలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఐదేళ్ల గ్రామాభివృద్ధి కోసం గ్రామ పాలకవర్గం చేసిన కృషి అభినందనీయమన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ శ్రీను, వైస్ ఎంపీపీ తుమ్మ వెంకటరెడ్డి, నాయకులు బత్తుల శ్రీనివాస్‌యాదవ్, కాసం శేఖర్, యుగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

కేసముద్రం: అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యలను పరిష్కరించాలంటూ ఈనెల 16న చేపట్టే దేశవ్యాప్త కార్మిక సమ్మె–గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి పదేళ్లు కావస్తున్నప్పటికీ, అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకురాలు నిర్మల, కళావతి, లక్ష్మీ, రమణ, లలిత, సునీత పాల్గొన్నారు.

చెకుముకిలో ప్రతిభ



చిన్నగూడూరు: మహబూబాబాద్ జిల్లాలోని రవిచంద్ర కన్వెన్షన్ హాల్‌లో 8, 9, 10 తరగతులకు జరిగిన జిల్లా స్థాయి చెకుముకి పరీక్షలో మండల కేంద్రంలోని చిన్నగూడూరు పాఠశాల విద్యార్థులు సాత్విక్, లక్ష్మణ్, మురారి, గణేష్ ప్రతిభ కనబర్చారు. సోమవారం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవికుమార్, గైడ్ టీచర్ రెహమాన్, ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, సతీష్‌రెడ్డి. రఘుపతి పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి

- ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడ రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యం అయిన విద్యను బలోపేతం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. మరిపెడ మండలం వీరారం హైస్కూల్‌లో రూ.13.50లక్షలతో నిర్మిస్తున్న సైన్స్ ల్యాబ్ భవనానికి మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాం నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనిర్మల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. లేని క్రమంలో గత ప్రభుత్వంలో కేసీఆర్ పంపిణీ చేసిన గొర్రెలు కాస్తూ, చేపలు పట్టుకోవాల్సి వస్తుందన్నారు. పాఠశాల ఏర్పాటుకు విలువైన రెండు ఎకరాల స్థలానికి దానం చేసిన దాత డాక్టర్ కట్కూరి నరేందర్‌రెడ్డికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వేసవి కాలం వస్తుంది కనుక గ్రామాల్లో సాగు, తాగు నీటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. గ్రామాల్లోని చెరువులను ఎస్సారెస్పీ జలాలతో నింపాలని అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో నిర్మించిన గద్దెపై కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. గ్రామంలోని ముదిరాజ్‌ల ఆరాధ్యదైవం పెద్దమ్మతల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి, స్థల దాత నరేందర్‌రెడ్డి, నాయకులు తాజుద్దీన్, రవినాయక్, యాదగిరి, నవీన్ పాల్గొన్నారు.



మరిపెడ రూరల్: వీరారంలో సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

అక్రమ వ్యాపారాలను అరికట్టాలి

చిన్నగూడూరు: మండల కేంద్రంలో రేషన్ బియ్యం, ఇసుక అక్రమ వ్యాపారాలను అరికట్టేందుకు అధికారులు తక్షణమే చర్య తీసుకోవాలని, మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూం కోసం డబ్బులు చెల్లించిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి బాధ్యులపై కేసులు నమోదు చేయాలని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ మండల అధికారులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వల్లూరి పద్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మొదటిసారిగా సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ హాజరవడంతో ఎంపీపీ వల్లూరి పద్మ వెంకట్ రెడ్డి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి సాదరంగా ఆహ్వానించారు. సమావేశంలో భాగంగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఆరు గ్యారంటీలను విజయవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్యాంసుందర్, తహసీల్దార్ మహబూబ్ అలీ, ఎంపీఓ యాకయ్య, వైస్ ఎంపీపీ వీరన్న, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



చిన్నగూడూరు: సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యేకు వినతులు

మండల కేంద్రంలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలతోపాటు పక్కా గృహాలను కేటాయించాలని మండల జర్నలిస్టులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్స్, కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు.

వందశాతం ఫలితాలు సాధించాలి

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ అర్బన్: పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు హెచ్‌ఎంలు కృషి చేయాలని ఎమ్మెల్యే మురళీ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మానుకోట నియోజకవర్గస్థాయి హెచ్‌ఎంలతో పది ఫలితాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. పది వార్షిక పరీక్షలకు 40 రోజులు మాత్రమే ఉందని, ప్రతి పాఠశాలను ఆకస్మికంగా సందర్శిస్తానన్నారు. పది ఫలితాలు వచ్చిన తర్వాత ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా డీఈఓ రామారావు మాట్లాడుతూ.. జిల్లాను టాప్ పదిలో ఉండేవిధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏసీజీ శ్రీరాములు, ఏఎంఓ ఆజాద్ చంద్రశేఖర్, జీసీడీఓ విజయకుమారి, డీఎస్ఓ అప్పారావు, ఎంఈఓలు పూల్ చందు, రాము, శ్రీదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చెరువు పూడికతీత పనుల్లో అవినీతి



మాట్లాడుతున్న ఏపీడీ శాంతాకుమారి

గార్ల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సోమవారం గార్లలో నిర్వహించిన 15వ విడత సామాజిక తనిఖీ తుది నివేదికలో ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల నుంచి రూ.5,33,842 రికవరీ చేయాలని ఏపీడీ శాంతాకుమారి ఎంపీడీఓ రవీందర్‌ను ఆదేశించారు. డిశంబర్ 2021 నుంచి 2023 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై వైస్‌ఎంపీపీ కట్టెబోయిన శ్రీనివాసరావు అధ్యక్షతన సామాజిక తనిఖీ సమావేశం జరిగింది. సామాజిక తనిఖీ బృందం పంచాయతీల వారిగా తమ ఆడిట్ నివేదికలను చదువుతుండగా ఈజీఎస్‌లో జరిగిన అవినీతి బయటపడింది. మండలంలో 800 పనులకు గాను కూలీలకు రూ.6,44,99,300 చెల్లింపులు జరిగాయని పేర్కొన్నారు. సీతంపేట పంచాయతీలో చెరువు పూడికతీత పనుల్లో 165 మస్టర్ రిజిస్టర్లలో ఏపీఓ, ఎంపీడీఓ, పంచాయతీ సెక్రటరీల సంతకాలు లేకుండానే రూ.6,92,432 అక్రమంగా కూలీలకు చెల్లింపులు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించింది. మండలంలో గార్ల పంచాయతీలోనే ఎక్కువగా అవినీతి జరిగిందని, చెరువు పూడికతీత పనుల్లో పని ఎస్టిమేషన్ కంటే కూలీలకు రూ.2,36,000 ఎక్కువగా చెల్లించారని సామాజిక తనిఖీ బృందం వెల్లడించారు. సమావేశంలో ఎంపీడీఓ రవీందర్, విజిలెన్స్ అధికారి అంబుర్స్, ఎస్ఆర్పీ సుశీల, డీఆర్పీ రాజశేఖర్, ఈ కిషోర్, ఎంపీఓ రజిని, ఏపీఓ సజన్‌స్వరూప్, కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి

మహబూబాబాద్: పట్టభద్రులు తప్పనిసరిగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ కోరారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. కాంగ్రెస్ నాయకుల మాయమాటలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందిందన్నారు. రాబోయో అన్ని ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. నాయకుడు రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. సమాజంలో విద్యావంతుల బాధ్యత ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, మార్నెని వెంకన్న, యాకుబ్‌రెడ్డి, గద్దె రవి, యాళ్ల మురళీధర్‌రెడ్డి, గోగుల రాజు, ఎల్ది మల్లయ్య, తేళ్ల శ్రీను, రఘు, అశోక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

నిధులు మంజూరు

నెల్లికుదురు: ఇనుగుర్తి, నెల్లికుదురు, దంతాలపల్లి మండలాల అభివృద్ధి పనులకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర రూ.2.74కోట్లు మంజూరు చేసినట్లు కేసముద్రం, నెల్లికుదురు మండలం శ్రీరామగిరి సొసైటీ చైర్మన్లు దీకొండ వెంకన్న, గుండ వెంకన్న తెలిపారు. మండలంలో సోమవారం వారు మాట్లాడుతూ.. నెల్లికుదురు మండంలం చిన్నముప్పారం గ్రామానికి రూ.13లక్షలు, దంతాలపల్లి మండలం బొడ్లాడ గ్రామానికి రూ.9.96లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, చంద్రయ్య, భోజ్యానాయక్, రామ్మూర్తి, శోభన్, రామన్న, అరుణ హరిచంద్రు, రజిత పాల్గొన్నారు.

8న రాష్ట్ర సదస్సు

నెహ్రూసెంటర్: ఈనెల 8వ తేదీన ఎమ్మార్పీఎస్ దండోర ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి మహిళా సదస్సును జయప్రదం చేయాలని సంఘం మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి కుక్కల సుధారాణి అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. ఈ పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో సీహెచ్ రాధా, ప్రవీణ, అరుణ, సంధ్య, కీర్తన పాల్గొన్నారు.

కమ్యూనిస్టులను విమర్శించడం హాస్యాస్పదం

నెహ్రూసెంటర్: మానవ మనుగడ ఉన్నంత కాలం కమ్యూనిస్టుల మనుగడ ఉంటుందని, కమ్యూనిస్టుల గురించి మాట్లాడే నైతిక అర్హత బీజేపీ నేతలకు సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ పట్టణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల పక్షాన నిలిచేది, పోరాడేది, గెలిచేది కమ్యూనిస్టులేనని కమ్యూనిస్టుల చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని బీజేపీ నేత ధర్మారావుకు సూచించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనకుండా, త్యాగాలు చేయని బీజేపీ కమ్యూనిస్టులను విమర్శించడం హాస్యాస్పదమన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ, విద్వేషాలను రెచ్చగొడుతూ దేశాన్ని విచ్ఛిన్నం చేస్తూ రాజకీయాలు చేస్తూ బీజేపీ పబ్బం గడుపుకుంటుందని విమర్శించాడు. చింతకుంట్ల వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, కట్లోజు పాండురంగాచారి, మామిండ్ల సాంబలక్ష్మీ, నర్ర శ్రావణ్, మంద శంకర్, మహేష్, భాగ్యమ్మ, శ్రావణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయసారథిరెడ్డి

ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు



ధర్నా చేస్తున్న సంఘం నాయకులు

నెహ్రూసెంటర్: ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్య తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బోనగిరి మధు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. తాత్కాలిక పద్ధతిలో నియమిస్తున్న ఉద్యోగాలకు ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా భర్తీ చేశారని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడుతున్న ఏజెన్సీ నిర్వాహకులపై చర్య తీసుకుని ఏజెన్సీని రద్దు చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్‌కు సమస్యను వివరించారు. ఈ విషయమై కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పద్మను వివరణ కోరగా నిబంధనల ప్రకారమే నియామకాలు జరిగాయని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి మునగాల మహేష్, గుగులోత్ విజయ్, వినయ్, దిలీప్, సంజయ్, చింటూ, తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ చేపట్టాలి

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీలో జరిగిన అవినీతి, నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరపాలని మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం గాంధీ సెంటర్‌లో ధర్నా నిర్వహించి, అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ నిధుల గోల్‌మాల్‌పై హైలెవల్ కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరపాలన్నారు. దుర్వినియోగమైన నిధుల రికవరీ, రూ.50కోట్ల నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఖాదర్‌బాబా, ఎల్లావుల హరికృష్ణ, శీలం శ్రీనివాస్, తారాచంద్, ఎస్ వెంకటేశ్వర్లు, రెడ్డెబోయిన భాస్కర్, మహేష్, ఖాసీం, పంద్రగిరి కృష్ణమూర్తి, ఎడమకంటి రవి, అశ్వక్, యాకయ్య, ప్రవీణ్, వీరస్వామి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు

పాలకవర్గానికి ఆత్మీయ వీడ్కోలు



మహబూబాబాద్ రూరల్: దామ్యతండాలో పాలక వర్గానికి సన్మానం..



తొర్రూరు రూరల్: పోలెపల్లిలో పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

కురవి: మండలంలోని సూదనపల్లి శివారు బీబీనాయక్ తండా గ్రామంలో పంచాయతీ పాలకవర్గాన్ని సోమవారం ఘనంగా సత్కరించారు. ఐదు ఏళ్లపాటు మాజీ సర్పంచ్ బోడ శ్రీను, మాజీ వార్డు సభ్యులు ప్రజలకు సేవలందించారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటేశ్వర్లు, భూక్య బుజ్జిరవి, అరుణనగేష్, సురేష్, బానోత్ బాష్‌సింగ్, బోడపార్వతిపాండు, గుగులోత్ ఉపేందర్, మాలోత్ సుజాతనెహ్రూ పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్: పదవులు ఉన్నా లేకపోయినా ప్రజాసేవలో నిరంతరం ఉండాలని మండల కోఆప్షన్ సభ్యుడు ఎండి అంకూస్ అన్నారు. సోమవారం మండలంలోని పోలెపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం మాజీ సర్పంచ్ పందుల యాకయ్యతోపాటు, మాజీ ఉప సర్పంచ్, మాజీ వార్డు సభ్యులను ఘనంగా సత్కరించారు.

మహబూబాబాద్ రూరల్: మండలంలోని దామ్యతండా మాజీ సర్పంచ్ బానోత్ మీరాదాము నాయక్, మాజీ ఉప సర్పంచ్ కల్యాణిమోహన్, మాజీ వార్డు సభ్యులు వెంకన్న, రవి, కిష్టు, ప్రమీల, కోప్షన్ సభ్యులు ప్రియాంక, నవీన్, వాలు, లింగ్య, తదితరులను సోమవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి జగన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ ఆదివాసీలకు ఇవ్వాలి

గూడూరు: కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ ఎంపీ టికెట్ ఆదివాసీ సామాజిక వర్గానికే ఇవ్వాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షుడు దాట్ల నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశాడు. సోమవారం ఆయన మాట్లాడారు. ఈసారి మానుకోట ఎంపీ టికెట్ ఎట్టి వెంకన్నకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి పడిగె నాగేశ్వర్‌రావు, జిల్లా అధ్యక్షుడు బొల్లి సారయ్య, వాగబోయిన చంద్రయ్య పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

తొర్రూరు రూరల్: ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు పట్ల మధు తెలిపారు. సోమవారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈనెల 9, 10 తేదీల్లో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నమన్నారు. విద్యార్థులు పాల్గొని ప్రతిభను చాటాలని తెలిపాడు. కార్యక్రమంలో సంఘం నాయకులు అమీర్, వినయ్, మహేష్, ప్రవీణ్, ప్రణీత్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సునీల్‌రెడ్డికి పితృవియోగం



సంజీవరెడ్డి (ఫైల్)

కురవి: రాష్ట్ర ప్రభుత్వ భూ సమస్యల సలహాదారుడు, ధరణి కమిటీ సభ్యుడు 'భూమి' సునీల్‌రెడ్డి తండ్రి మేక సంజీవరెడ్డి (70) గుండెపోటుతో సోమవారం హైదరాబాద్‌లో మృతి చెందాడు. కురవి మండలం అయ్యగారి పల్లి గ్రామానికి చెందిన మేక సునీల్‌రెడ్డి(భూమి సునీల్) తండ్రి సంజీవరెడ్డి హైదరాబాద్‌లో చిన్న కుమారుడు మేక సందీప్ ఇంట్లో ఉన్న సమయంలో అస్వస్థతకు గురికాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పాఠశాలకు రూ.5వేల వితరణ

బయ్యారం: తను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి ఆర్మీ జవాన్ సోమవారం రూ.5వేలు వితరణగా అందజేశాడు. మండలంలోని వెంకట్రాంపురం ఉన్నత పాఠశాలలో బాలాజీపేటకు చెందిన తోకల రమేష్ ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. నగదును తన తండ్రి వెంకన్న ద్వారా పాఠశాల హెచ్‌ఎం లింగరాజుకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరన్న, వెంకటేశ్వర్లు, తావు, రమేష్, మహేందర్, ఎం.వీరన్న, ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

పెద్దవంగర: మండలంలోని పలు గ్రామాల్లో ఝాన్సీ రాజేందర్‌రెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకుడు పెదగాని సోమయ్య, మండల ప్రధాన కార్యదర్శి పాడిశెట్టి సైదులు గౌడ్, శ్రీనివాస్, మల్లేష్, కొమురయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

నివాళి

మహబూబాబాద్ అర్బన్: రచయిత వట్టికోట ఆళ్వారుస్వామి వర్ధంతిని సోమవారం జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ ఆళ్వారుస్వామి చిత్రపటానికి పూల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్, అధ్యాపకులు రమేష్, ఉప్పలయ్య, పాషా, ప్రసాద్ పాల్గొన్నారు.

అల్పాహారం అందజేత

గూడూరు: మండలంలోని తీగలవేణి జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సోమవారం గ్రామానికి చెందిన వేం వెంకటకృష్ణారెడ్డి, కందాలం రాములు సహకారంతో ఉపాధ్యాయులు స్నాక్స్ అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఫరూక్, ఉపాధ్యాయులు ధర్మానాయక్, పురుషోత్తం, సాంబయ్య పాల్గొన్నారు.

అన్నప్రాసన

గార్ల: మండలంలోని చిన్నకిష్టాపురం పంచాయతీ మంగళితండా అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంపూర్ణ అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు.

ప్లాస్టిక్ కవర్లు అమ్మితే చర్యలు

దంతాలపల్లి: షాపుల్లో ప్రభుత్వ నిషేధిత ప్లాస్టిక్ కవర్లు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనువాస్‌రావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రతి షాపు యజమాని అనుమతి తీసుకోవాలన్నారు. అలాగే గ్రామాలలో ఇంటి పన్ను ఈనెల చివరి వరకు చెల్లించి, గ్రామ అభివృద్ధికి సహకరించాలన్నారు.

కూలి రేట్ల పెంపుపై చర్చలు

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో మిల్లుల్లో పనిచేస్తున్న కూలీల, హమాలీల రేట్ల పెంపు విషయంపై సోమవారం కార్మిక సంఘాల నాయకులు, వ్యాపారులతో మార్కెట్ అధికారులు చర్చలు జరిపారు. కాగా రేట్ల ఒప్పందం ప్రకారంగా కూలి రేట్లను పెంచేందుకు వ్యాపారులు అంగీకరించారని, దీంతో చర్చలు సఫలమైనట్లు మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు తెలిపారు.

మత్స్యకారుల సభ్యత్వ నమోదు

డోర్నకల్: డోర్నకల్ పట్టణ మత్స్యపారిశ్రామిక సహకార సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం స్థానికంగా జరిగింది. పెద్ద చెరువు వద్ద జరిగిన సంఘ సమావేశంలో 85మందికి పట్టణ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కూనారపు శంకర్ ఆధ్వర్యంలో నూతనంగా సభ్యత్వం అందించారు. కార్యక్రమంలో ఏరువ ఎల్లయ్య, కొమరెల్లి, రాజు, రాంభద్రం, మామిడి సాంబయ్య, వేణు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

మరిపెడ: నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఎంపీపీ గుగులోతు అరుణ అన్నారు. నూతనంగా గ్రామ పంచాయతీల బాధ్యతలు చేపట్టిన అధికారులతో మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సమావేశంలో ఆమె మాట్లాడుతూ. క్యాక్రమంలో ఎంపీఓ పూర్ణచందర్‌రెడ్డి, కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవుగా ప్రకటించాలి

కురవి: సేవాలాల్ మహారాజ్ జయంతి ని సెలవు రోజుగా ప్రకటించాలని సేవాలాల్ సేన డోర్నకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్య నరేష్‌నాయక్ తెలిపారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు.

రాజకీయంగా ఎదగాలి

గూడూరు: ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహారావు అన్నారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం కొత్తగా ఎన్నికైన ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు బొల్లం సాంబమూర్తి అధ్యక్షతన నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు

గార్ల: గార్ల మండలం చిన్నబంజర గ్రామానికి చెందిన రామల్ సోమవారం తన ఇద్దరు పిల్లలు హర్షవర్ధన్, పరమేష్‌లను స్కూల్ వదిలిపెట్టిన అనంతరం ద్విచక్ర వాహనంపై ఇంటికి తీసుకెళ్తున్నాడు. గార్లలోని సబ్‌స్టేషన్ సమీపంలో కోట్యానాయక్ తండాకు చెందిన ఆంగోత్ కృష్ణ ద్విచక్ర వాహనంపై వస్తూ రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురికి తీవ్రయాలు కావడంతో క్షతగాత్రులను గార్ల సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేస్తున్నారు.

నిందితులను శిక్షించాలి

మహబూబాబాద్ రూరల్: భువనగిరి ఎస్సీ బాలికల హాస్టల్లో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్యకు కారకులైన నిందితులను శిక్షించాలని తెలంగాణ రాష్ట్ర యాదవ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గుండ్ల రాకేష్ యాదవ్ డిమాండ్ చేశారు. మండలంలోని వేమునూరు గ్రామంలో సోమవారం మాట్లాడారు. సమావేశంలో లోకేష్ యాదవ్, సాయియాదవ్, ప్రవీణ్ యాదవ్, వినయ్, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



పెద్దవంగర/బయ్యారం: ఈనెల 11, 12 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించ తలపెట్టి టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శులు సోమారపు ఐలయ్య, కొమిరె ఉప్పలయ్య పిలుపునిచ్చారు. సోమవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యారంగానికి తగిన నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు చిక్కాల సతీష్ నాయకులు యుగేందర్, సురేష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, మురళీ, వెంకటేశం, కేజీబీవీ ఎస్ఓ స్రవంతి, సైదమ్మ, మీరా, ప్రవీణ్, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, శ్రీను, వీరన్న, సరోజ, కవితపాల్గొన్నారు.